# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 20-08-2025** **సమయం : 6.45 గంటలు**

---

# ముఖ్యాంశాలు

**1.** **పేదరిక నిర్మూలన కోసం చేపట్టిన పీ4 కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పిలుపునిచ్చారు.**

**2.** **తెలుగు వ్యక్తి ఉప రాష్ట్రపతి అయ్యేలా తెలుగువారందరూ జస్టిస్ సుదర్శన్‌రెడ్డికి మద్దతు ఇవ్వాలని తెలంగాణ ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి కోరారు.**

**3.** **ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతిలో నిర్మాణ పనులు కొనసాగుతున్నాయని పురపాలక శాఖ మంత్రి పి.నారాయణ తెలిపారు.**

**4.** **తెలంగాణలో ఎంబీఏ, ఎంసీఏ కోర్సుల్లో ప్రవేశాలకు సంబంధించి నిర్వహించిన టిజిఐసెట్-2025 వెబ్ కౌన్సెలింగ్ ఈరోజు నుంచి ప్రారంభంకానుంది.**

**3.** **ఆంధ్రప్రదేశ్‌లో ఏర్పాటు చేసే పరిశ్రమలకు సులభంగా అనుమతులు లభించేలా చర్యలు తీసుకుంటున్నామని పరిశ్రమల శాఖ మంత్రి టి.జి భరత్ పేర్కొన్నారు.**

==========================

పేదరిక నిర్మూలన కోసం చేపట్టిన ప్రభుత్వ, ప్రైవేటు, ప్రజల భాగస్వామ్యం-పీ4 కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పిలుపునిచ్చారు. గుంటూరు జిల్లా మంగళగిరిలో నిన్న నిర్వహించిన సమావేశంలో పీ4 అమలు కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. పేదరికం లేని రాష్ట్రమే ప్రభుత్వ లక్ష్యమని, సమాజంలో ఆర్థిక అసమానతలు తగ్గించవలసిన అవసరముందని పేర్కొన్నారు. రాష్ట్రంలో ఇప్పటివరకు 13 లక్షలకు పైగా బంగారు కుటుంబాలను, కోటిమందికి పైగా మార్గదర్శులు దత్తత తీసుకున్నారని ముఖ్యమంత్రి వివరించారు.

--------------------------

తెలుగు వ్యక్తి ఉప రాష్ట్రపతి అయ్యేలా తెలుగువారందరూ జస్టిస్ సుదర్శన్‌రెడ్డికి మద్దతు ఇవ్వాలని తెలంగాణ ముఖ్యమంత్రి ఏ రేవంత్ రెడ్డి కోరారు. హైదరాబాద్‌లోని ముఖ్యమంత్రి నివాసంలో ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో నిన్న మాట్లాడుతూ, 1991లో పీవీ నరసింహారావు ప్రధానమంత్రిగా అయ్యేందుకు నాడు తెలుగువారంతా ఏకమైయ్యారని చెప్పారు. ఇప్పుడు తెలుగువాడైన సుదర్శన్‌రెడ్డికి మద్దతు పలికి రాజకీయ విజ్ఞతను ప్రదర్శించాలని కోరుతూ,

వాయిస్ 20 సెకన్లు

కాగా ఉపరాష్ట్రపతి ఎన్నికలకు భారత కూటమి అభ్యర్థిగా సుప్రీంకోర్టు పూర్వ న్యాయమూర్తి బి.సుదర్శన్ రెడ్డి పేరును కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షులు మల్లికార్జున్ ఖర్గే నిన్న ప్రకటించారు.

---------------------------

ఎగువన కురుస్తున్న భారీ వర్షాలతో వరద పెరుగుతున్నందున ఆంధ్రప్రదేశ్‌లోని ఉభయ గోదావరి జిల్లాల తీర ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ తెలిపారు. గోదావరి నది వద్ద నీటి మట్టం, ప్రవాహం, రక్షణ చర్యలు పరిశీలించి ఎప్పటికప్పుడు ప్రజలను అప్రమత్తం చేయాలని ఒక ప్రకటనలో తెలిపారు. ప్రస్తుతం ధవళేశ్వరం బ్యారేజ్ కు 8.29 లక్షల క్యూసెక్కుల వరద నీరు వస్తోందని పేర్కొన్నారు. వరద ఉధృతి మరింత పెరిగే అవకాశమున్న నేపథ్యంలో వర్షాలు తగ్గుముఖం పట్టే వరకు ప్రజలెవరూ నది పరివాహక ప్రాంతాలకు వెళ్లవద్దని సూచించారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతిలో నిర్మాణ పనులు కొనసాగుతున్నాయని పురపాలక శాఖ మంత్రి పి.నారాయణ తెలిపారు. అమరావతిలో కొండవీటి వాగు వద్ద వరద నీరు నిలిచిపోయిన ప్రాంతాలను మంత్రి గత సాయంత్రం పరిశీలించారు. అనంతరం ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ, వచ్చే మార్చి నాటికి అధికారుల, ఉద్యోగుల భవనాలను కూడా సిద్దం చేస్తున్నామన్నారు. పశ్చిమ బైపాస్ పై బ్రిడ్జి నిర్మాణ సమయంలో మట్టి అడ్డుగా ఉండటంతో వాగు ప్రవాహానికి ఇబ్బందులు తలెత్తాయని, దాన్ని తొలగిస్తున్నామని మంత్రి పేర్కొంటూ,

వాయిస్ 30 సెకన్లు

---------------------------

దేశవ్యాప్తంగా ఈ నెల 29వ తేదీ నుండి 31 వరకు జాతీయ క్రీడా దినోత్సవం-2025ను కేంద్ర ప్రభుత్వం నిర్వహించనుంది. ఈ సందర్భంగా కేంద్ర క్రీడాశాఖ మంత్రి మనసుఖ్ మాండవీయ అధ్యక్షతన దృశ్య మాధ్యమ విధానంలో రాష్ట్రాల క్రీడా మంత్రులతో క్రీడా దినోత్సవ ఏర్పాట్లపై నిన్న సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో అమరావతి నుండి ఆంధ్రప్రదేశ్ క్రీడాశాఖ మంత్రి ఎం. రాంప్రసాద్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రాష్ట్ర వ్యాప్తంగా జాతీయ క్రీడా దినోత్సవ కార్యక్రమంలో అన్ని జిల్లాల్లోని విద్యాసంస్థలు, ప్రభుత్వ శాఖలు, యువజన సంఘాలు, క్రీడా సంస్థలు పాల్గొనేలా ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక రూపొందిస్తున్నామన్నారు. ప్రతి పౌరుడూ ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవర్చుకోవాలని, క్రీడలను జీవితంలో భాగంగా చేసుకోవాలని మంత్రి వివరించారు.

---------------------------

పెట్టుబడుల ద్వారా ఆంధ్రప్రదేశ్‌లో ఏర్పాటు చేసే పరిశ్రమలకు సులభంగా అనుమతుల లభించేలా చర్యలు తీసుకుంటున్నామని పరిశ్రమల శాఖ మంత్రి టి.జి భరత్ తెలిపారు. గుంటూరు జిల్లా మంగళగిరిలో పరిశ్రమల శాఖ అధికారులతో మంత్రి నిన్న సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రభుత్వ ప్రోత్సాహకాలతో రాష్ట్రానికి పెట్టుబడులు వస్తున్నాయని చెప్పారు. పారిశ్రామిక పార్కుల్లోని సమస్యలను పరిష్కరించాలని, ప్రతి జిల్లాలో తప్పనిసరిగా జిల్లా అభివృద్ధి సమన్వయ, పర్యవేక్షణ కమిటీ -డి.ఐ.పి.సి సమావేశాలు నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. క్షేత్ర స్థాయిలోని ఇబ్బందులను ప్రభుత్వం దృష్టికి తీసుకురావాలని మంత్రి సూచించారు.

-----------------------------

తెలంగాణలో ఎంబీఏ, ఎంసీఏ కోర్సుల్లో ప్రవేశాలకు సంబంధించి నిర్వహించిన తెలంగాణ ఇంటిగ్రేటెడ్ కామన్ ఎంట్రన్స్ టెస్ట్- టిజిఐసెట్ 2025 వెబ్ కౌన్సెలింగ్ ఈరోజు నుంచి ప్రారంభంకానుంది. ఈ ఏడాది కౌన్సెలింగ్ ను రెండు విడతల్లో నిర్వహించనున్నారు. మొదటి విడత కౌన్సెలింగ్ ఈరోజు నుంచి ప్రారంభమయ్యి.. సెప్టెంబర్ 5తో ముగియనుంది. తుది విడత కౌన్సెలింగ్ సెప్టెంబర్ 8న ప్రారంభమై, 16న ముగుస్తుంది. విద్యార్థులు కౌన్సెలింగ్ షెడ్యూల్, నోటిఫికేషన్ వంటి వివరాల కోసం అధికారిక వెబ్‌సైట్ gicet.nic.in ను సందర్శించవచ్చని అధికారులు తెలిపారు.

-----------------------------

భారత మాజీ ప్రధానమంత్రి రాజీవ్ గాంధీ జయంతి ఈరోజు. జాతీయ "సద్భావనా దివస్"గా జరుపుకుంటున్నారు. 1944 ఆగస్టు 20న ముంబైలో జన్మించిన ఆయన 40 ఏళ్ల వయసులోనే భారత ఆరవ ప్రధానమంత్రిగా సేవలందించారు. 1984లో తన తల్లి ఇందిరాగాంధీ మరణానంతరం రాజీవ్ గాంధీ, ప్రధానమంత్రిగా బాధ్యతలు చేపట్టారు. ఆధునిక భావాలు, నిర్ణయాత్మక ఆలోచనలు కలిగిన రాజీవ్ గాంధీ అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞాన ప్రపంచంలో సుస్థిర స్థానం సంపాదించుకున్నారు.

-----------------------------

తెలంగాణలోని హైదరాబాద్ సహా ఉమ్మడి రంగారెడ్డి జిల్లాల్లో గణేష్ ఉత్సవాలను ప్రణాళికాబద్ధంగా నిర్వహిస్తామని జిల్లా ఇంచార్జీ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. హైదరాబాద్, ఉమ్మడి రంగారెడ్డి జిల్లాల గణేష్ ఉత్సవాలు-2025 ఏర్పాట్లపై హైదరాబాద్‌లో నిన్న మంత్రి అధ్యక్షతన సమన్వయ సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ.... ఈ నెల 27 వ తేదీన ప్రారంభమై సెప్టెంబర్ 6వ తేదీన ముగియనున్న గణేష్ ఉత్సవాలు-2025 సజావుగా జరిపేందుకు నిర్వాహకులు, ప్రజలు సహకారం అందించాలని కోరారు. శాంతి భద్రతలకు విఘాతం కలగకుండా, ట్రాఫిక్ సమస్యలు ఉత్పన్నం కాకుండా పోలీసులు పటిష్ట చర్యలు చేపట్టాలని మంత్రి సూచించారు.

-----------------------------

ప్రధానమంత్రి నరేంద్రమోదీ తన మనసులోని భావాలను ఆకాశవాణి ద్వారా దేశ ప్రజలతో పంచుకునే "మన్ కీ బాత్" మనసులోని మాట కార్యక్రమం 125వ సంచిక ఈనెల 31వ తేదీ ఆదివారం ప్రసారమవుతుంది. "మన్ కీ బాత్" కార్యక్రమానికి ప్రజలు తమ సూచనలు అందించాలని ప్రధానమంత్రి కోరారు. ప్రజలు తమ స్వర సందేశాలను 1800 11 7800 నెంబర్‌కు ఈనెల 29వ తేదీ సాయంకాలం వరకు పంపవచ్చు.

-----------------------------

దక్షిణ ఒడిశాలోని గోపాల్‌పూర్ సమీపంలో నిన్న తీరం దాటిన వాయుగుండం పశ్చిమ-వాయవ్య దిశగా ఒడిశా, ఛత్తీస్‌గఢ్ మీదుగా కదులుతూ తీవ్ర అల్పపీడనంగా బలహీనపడుతుందని భారత వాతావరణ కేంద్రం తెలిపింది. దీని ప్రభావంతో రాబోయే నాలుగు రోజుల్లో ఆంధ్రప్రదేశ్‌లోని పలు ప్రాంతాల్లో తేలికపాటి నుంచి ఓ మోస్తరు వర్షాలకు అవకాశముందని వాతావరణ కేంద్రం అధికారి జగన్నాథ కుమార్ తెలియజేస్తూ,

వాయిస్ 30 సెకన్లు

మరోవైపు తెలంగాణలోనూ రానున్న నాలుగు రోజులపాటు తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది.

======================